చిన్నారి మేధస్సుకు వందనం

- ఆకర్షించే ప్రయోగం- శాస్త్రం అద్వితీయం
- తిరుపతి ఐసర్‌లో వేడుకగా జాతీయ సైన్స్ దినోత్సవం

ఏర్పేడు(రేణిగుంట): చిన్నారి మేధస్సుకు పదును పెడితే, మహా మేధావులైనా విస్తుపోవాల్సిందే. సుమారు వంద ప్రదర్శనలతో సందర్శకుల మది దోచేశారు. వారి సృజనాత్మకతను చాటుకున్నారు. ఆ ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకించిన భావి శాస్త్రవేత్తలు మదినిండా స్ఫూర్తి నింపుకున్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐసర్‌లో శుక్రవారం 10వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డైరెక్టర్ శంతను భట్టాచార్య పర్యవేక్షణలో ఐసర్ విద్యార్థులు సుమారు 100కు పైగా సైన్స్ ప్రదర్శనలు రూపొందించి ప్రదర్శించారు. వాటిని జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించి దేశం గర్వించే భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్న సంకల్ప బీజాన్ని మదిలో బలంగా నాటుకున్నారు. ఐసర్‌లో జరిగిన సైన్స్ ప్రదర్శనలను తిలకించేందుకు జిల్లాలోని వివిధ స్కూళ్ల నుంచి 800మందికి పైగా విద్యార్థులు వచ్చారు. పుస్తకాల్లో చదువుకున్న సైన్స్ పాఠాలకు సంబంధించిన ప్రత్యక్ష జ్ఞానం పొందే రీతిలో పాఠశాల విద్యార్థులను రసాయన మూలకపు ప్రయోగ వాసనలు ఇట్టే కట్టిపడేశాయి. వివిధ సర్పాల రూపాలు భయపెట్టాయి. పక్షుల బొమ్మలు పలకరించాయి. ఆరోగ్య సూత్రాలు, మానవ శరీర ధర్మాలు, అవయవాలు, జంతు జాతులు, మొక్కల వైవిధ్యాలు వంటి ప్రయోగాలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల జిజ్ఞాసను రగిలించాయి.



ఐసర్ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రయోగాలు

ఆక్స్‌ఫర్డ్ సంస్థలో

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్నటువంటి ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పిల్లలందరూ సుమారు 200కు పైగా వివిధ రకాలైన సైన్స్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చి ఆ ప్రదర్శనను చూసి ఆస్వాదించారు. స్కూల్ కరెస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నీ ప్రదర్శనలు చూసి సైన్స్‌డే గురించి పిల్లలకు వివరించారు.





విద్యార్థులు ప్రదర్శిస్తున్న నమూనాలు





ఐజర్ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రయోగాల నమూనాలు



ప్రయోగాలను తిలకిస్తున్న విద్యార్థులు

ఆలోచనల ప్రతిరూపమే విజ్ఞాన శాస్త్రం



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈఓ

సత్యవేడు: మనిషి ఆలోచన శక్తి, ఊహాశక్తి ప్రారంభమైన నాటి నుంచి విజ్ఞాన శాస్త్రం మొదలైందని ఎంఈఓ రవి పేర్కొన్నారు. బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఇరుగుళం, మదనంబేడు జడ్పీ హైస్కూళ్లలో జాతీయ సైన్సు దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..



బహుమతులతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రయోగాలు చేస్తూ ఉంటే విద్యార్థులలో మేధస్సు పెరుగుతుందని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలతోపాటు నెలవాయి, కల్లివెట్టు, పల్లమాలలోని జెడ్పీ హైస్కూళ్లలో సైన్స్ డే నిర్వహించారు. ఉత్తమ నమూనాలు ఎంపిక చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని ది స్కూల్ శ్రీచైతన్య, విశ్వభారతి, బాలాజీ పాఠశాలలో కూడా సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

క్లుప్తంగా

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



కరపత్రాలను అందజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని న్యాయవాదులు పిలుపునిచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సుపథ మండపం వద్ద స్టాల్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వలన శారీరక, మానసికంగా ఆరోగ్యం పాడవుతుందన్నారు. చదువుకునే వయసులో పుస్తెల భారం వద్దని సూచించారు. బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ్, ప్రజ్ఞశ్రీ, రజనికుమారి, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 సర్వే చురుగ్గా చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను చురుగ్గా చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన వెస్టువరత్తూరు, కల్లివెట్టు, కారణి, నెలవాయి, వేణుగోపాలపురం, తలారివెట్టులో చేస్తున్న పీ-4 సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సర్వే రైతుల సమక్షంలోనే చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టరాదని, సచివాలయ ఉద్యోగులు దీనిని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రల సేవలు పునఃప్రారంభించండి

సత్యవేడు: పంచాయతీల్లో చెత్త సేకరణకు క్లాప్ మిత్రల (గ్రీన్ అంబాసిడర్) సేవలు పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీలను, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, పెద్ద ఈటిపాకం పంచాయతీ కార్యదర్శి జలజశ్రీ సంపద కేంద్రాల నుంచి మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్‌కు ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శుక్రవారం వర్మీ కంపోస్టు కేంద్రం నిర్వహణ వివరాలు యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు.

ముళ్లపొదలు తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లె కేటీరోడ్డు మలుపు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఉండడంతో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, శ్రీకాళహస్తి వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు శుక్రవారం జేసీబీతో ముళ్లపొదలను తొలగించారు. వారు మాట్లాడుతూ వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లరాదని, నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రాణాలు చాలా విలువైనవని, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా యువకులు ప్రాణాలను లెక్కచేయడం లేదని, దీనివలన వారి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



వరదయ్యపాళెం: మండలంలోని తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని బత్తలవల్లం సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో పరిశ్రమలకు చెందిన ప్లాస్టిక్ వ్యర్థాలను కంటైనర్ లారీ నుంచి అక్రమంగా అన్‌లోడ్ చేస్తుండటం..అదే సమయానికి అటువైపు వచ్చిన అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి ప్లాస్టిక్ వ్యర్థాల లారీని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీ ఆధారంగా అన్‌లోడ్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు ఏ పరిశ్రమ నుంచి బయటకు వస్తున్నాయో వివరాలు సేకరించి వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్ చేశారు.

శివయ్యకు టీటీడీ సారె



సారె తీసుకువస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

శ్రీకాళహస్తి : టీటీడీ తరఫున సారెను ఈఓ శ్యామలరావు పట్టణంలోని దేవాంగుల మండపం వద్దకు తీసుకొచ్చారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ బాపిరెడ్డి ఆయనకు స్వాగతం పలికి సారెను ఆలయానికి తీసుకువచ్చారు. అనువంశిక ప్రధానార్చకులు సారెను అలంకార మండపంలో అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి జరిగే కల్యాణోత్సవానికి సారెను స్వామి, అమ్మవార్ల సమర్పించనున్నట్లు ఈఓ తెలిపారు. అనంతరం టీటీడీ ఈఓకు స్వామి,అమ్మవార్ల తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

ముక్కంటికి పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం ఆలయం తరఫున పట్టువస్త్రాలను ఈఓ పెంచలకిషోర్ దంపతులు సమర్పించారు. మణికంఠేశ్వరాలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బయలుదేరి ఆలయంలోని అలంకార మండపానికి చేరుకున్నారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బాపిరెడ్డి పట్టువస్త్రాలను స్వీకరించారు. కాణిపాక ఈవోలను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఆనందరాత్రి (ఫాల్గుణ శుద్ధ పాఢ్యమి)

వాహన సేవలు, ఉదయం 11గంటలకు : రుద్రాక్ష అంబారి వాహన సేవ, రాత్రి 7గంటలకు- శ్రీ సభాపతి కల్యాణం.

ఆక్రమణలపై డీఎల్‌పీవో విచారణ

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీ స్థలాలను కొందరు ఆక్రమించారన్న ఫిర్యాదులు అందడంతో శుక్రవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో ప్రభురెడ్డి విచారణ జరిపారు. ఫిర్యాదుదారుడు రావణను పిలిపించి మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. గతంలో పంచాయతీకి చెందిన స్థలంలో పంచాయతీకి సంబంధించిన గది ఉండేదని, అందులో కరెంటు మీటరు అమర్చి, మోటారుతో నీరు పంచాలి నగర్‌కు సరఫరా చేసే వారిని వివరించారు. అయితే ఆ స్థలాన్ని అగరాల ఈశ్వర్ రెడ్డి రాసిచ్చినట్లుగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఓ వ్యక్తి రిజిస్టర్ చేయించుకుని అక్రమ నిర్మాణం చేపట్టాడని డీఎల్‌పీవోకు వివరించారు.

అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కేసులు

రేణిగుంటలో అనధికారికంగా కొందరు దొంగ బిల్లులు సృష్టించి చిరు వ్యాపారుల నుంచి అక్రమంగా గేటు వసూలు చేస్తున్నారని, వారిపై పోలీసు కేసులు నమోదు చేయించాలని డీపీవో సుశీలాదేవి పంచాయతీ కార్యదర్శి మణిని ఆదేశించారు. రేణిగుంటలోని చెత్త శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎక్కడా చెత్త కనపడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, ఎస్ డబ్ల్యూ పిసి జిల్లా కో-ఆర్డినేటర్ శిరీష, ఈవోపీఆర్డీ ప్రభురావు, రేణిగుంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు ఘన సన్మానం


శ్రీకాళహస్తి: టైలర్స్ డే సందర్భంగా పట్టణంలో 40 ఏళ్లుగా అదే వృత్తిలో ఉన్న దర్జీలను శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో చాంద్ బాషా, కోటి, పులి బాలసుబ్రమణ్యం, సుబ్రహ్మణ్యం, సుబ్బరా యులు, శ్రీనివాసులు, అశోక్, రాజా, నాగభూషణం, సెల్వ, పవిత్ర, భార్గవి, పగడాల రాజు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి భక్తులకు పలువురు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 1982-83లో టెన్త్ చదివిన విద్యార్థులు డీఎస్పీ నరసింహమూర్తి చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా 1984-85 విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నివాళి

సత్యవేడు: మండలంలోని వైఎస్సార్‌సీపీ రాచపాళెం సర్పంచ్ రూబెన్ తండ్రి పి. ప్రకాశం శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ రాచపాళెం దళితవాడకు వెళ్లారు. ప్రకాశం భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డితో కలసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దాసుకుప్పం, చిన్న ఈటిపాకం, ఇరుగుళం, రాజగోపాలపురం సర్పంచులు రవిరెడ్డి, గోవిందస్వామి, శేఖర్, మధుసూదన్‌రాజు, ఎంపీ రవి, పళణి, కే.శ్యాంప్రసాద్ రెడ్డి, రాజశేఖర్, ఎబినైజర్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు,



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

రేణిగుంట పంచాయతీ వేలం వాయిదా

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పంచాయతీ వేలంపాటను రాజకీయ గ్రహణం పట్టింది. శుక్రవారం జరగాల్సిన పంచాయతీ వేలంపాటలో టీడీపీలోని ఒక వర్గానికి మేలు చేసే ఉద్దేశంతో వేలంపాటను ఆఖరి నిమిషంలో వాయిదా వేయడంతో కూటమిలోని నాయకులు భగ్గుమన్నారు. రేణిగుంట పంచాయతీలోని వారపు సంత, కూరగాయల మార్కెట్, పంచాయతీ గదుల వేలంపాట వేసేందుకు పంచాయతీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో కాంట్రాక్టర్లు డీడీలు చేతబట్టుకుని శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే ఆఖరి నిమిషంలో వేలంపాటను వాయిదా వేసినట్టు నోటీస్ బోర్డులో నోటీసు అంటించి పంచాయతీ కార్యదర్శి మణి మాయమైపోయారు. దీంతో కాంట్రాక్టర్లు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నోటీస్‌లో కనీసం ఈవో సంతకం, కార్యాలయం స్టాంపు లేకపోవడం ఏమిటని కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. చివరికి ఈవో కార్యాలయం వద్దకు చేరుకొని పది రోజుల్లో వేలం పాట నిర్వహిస్తామని చెప్పడంతో అందరూ వెనుదిరిగారు.



రేణిగుంట పంచాయతీ కార్యాలయం ముందు వేచి ఉన్న వేలంపాటదారులు

ముత్యపు పందిరిపై శ్రీనివాసుడు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ముత్యపు పందిరిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు యోగ ముద్రలో యోగన్నసింహ అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. వైఖానస ఆగమోక్తంగా నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారు సింహ వాహనాన్ని అధిష్ఠించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. స్వామి అమ్మవార్లకు ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు ఆనంద్, రవి కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో శనివారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహన సేవ నిర్వహించనున్నారు.

కోలాహలంగా శివపార్వతుల కల్యాణం



భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న వేద పండితులు

వరదయ్యపాళెం: మండలంలో జ్యోతినగర్‌లోని శ్రీ పార్వతీ సమేత జ్యోతీశ్వరస్వామి కొలువైన శ్రీ జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం రాత్రి 11గంటలకు పైబడి కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి ముందుగా రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లలిత సహస్ర నామం, పూజా కార్యక్రమాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లను వేద పండితులు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణోత్సవాన్ని భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన ఆలయ ధర్మకర్త నందకుమార్ నాయుడు దంపతులు మహిళలకు పసుపు తాళిబొట్లను అందజేశారు. కల్యాణోత్సవం సందర్భంగా పలువురు నూతన వధువరులు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు, మోహనాచార్యులు అందజేశారు. ఎస్‌ఐ మల్లికార్జున, సిబ్బంది అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించారు.

సత్కారం



సాయిరామ్‌కు జ్ఞాపిక అందిస్తున్న అంజూయాదవ్

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన న్యాయవాది విప్పరపల్లి సాయిరామ్‌ను గతంలో వన్‌టౌన్ సీఐగా విధులు నిర్వర్తించిన అంజూయాదవ్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటం సాగిస్తున్న సాయిరామ్ సేవలు అమూల్యమని కొనియాడారు. అనంతరం జ్ఞాపిక అందించారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు శుక్రవారం స్థానిక పెండ్లి మండపం వద్ద జగదీష్ వర్మ, సత్యనారాయణశెట్టి, అశోక్‌శెట్టి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పగడాల రాజు, సెన్నీరు కుప్పం శేఖర్, మొగరాల గణేష్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకు అధికారులు

నాగలాపురం: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూకో బ్యాంక్, స్టేట్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు దరఖాస్తుదారుల విద్యార్హత, స్వయ ఉపాధిపై వారికి ఉన్న ఆసక్తిని ఇంటర్వ్యూలో ప్రశ్నించి తెలుసుకున్నారు. అలాగే వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 250 మందిలో 179 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్టు చెప్పారు.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించండి

శ్రీకాళహస్తి : మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే ఆప్కాస్ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనగడం గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సీఐటీయూ నేతలు వడ్డేపల్లి చెంగయ్య, గంధం మణి, గెడి వేణు, వై.కుమార్, వెలివేంద్రం పాల్గొన్నారు.

వైభవంగా పల్లికొండేశ్వరునికి త్రిశూల స్నానం



రావణ బ్రహ్మ వాహనంపై విహరిస్తున్న పరమేశ్వరుడు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం త్రిశూల స్నానంతో పరిసమాప్తమయ్యాయి. ఉదయం 5 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ పరివార దేవతలకు పూజార్చలు, అభిషేకాలు, యాగశాల మండపంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదోష మండపంలో శివగామి సమేత నటరాజ స్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి పంచామృతం. సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించిన తదనంతరం త్రిశూల స్నానం కార్యక్రమాన్ని భక్తుల శివ నామస్మరణల నడుమ నిర్వహించారు. దీనికి సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలను ముగించారు. అనంతరం స్వామి అమ్మవార్లను రావణ బ్రహ్మ వాహనంపై భక్తులను కటాక్షించారు. తిరువీధి ఉత్సవం నిర్వహించారు. త్రిశూల స్నాన కార్యక్రమానికి ఉభయదారులుగా ఎస్.ఉమాపతి కుటుంబ సభ్యులు, రావణ బ్రహ్మ వాహనసేవకు శ్రీసిటి ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్య నిర్వహణాధికారి లత, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కల్యాణం..కమనీయం

వరదయ్యపాళెం: మండలంలో సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణోత్సవం నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా ఆలయ ధర్మకర్త మాయాని శేఖర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



శివపార్వతుల కళ్యాణోత్సవం